నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 30 డిసెంబర్ 2024 | SIDDIPET

కల్యాణం..వైభోగం

సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో కల్యాణోత్సవానికి స్వామివారి ఉత్సవమూర్తితో వస్తున్న కాశీపీఠాధిపతి

- వైభవంగా మల్లన్న కల్యాణ మహోత్సవం
- వేద మంత్రోచ్ఛరణలతో మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఆలయవర్గాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- హాజరైన ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చేర్యాల, డిసెంబర్ 29 : సిద్దిపేట జిల్లా లోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. క్షేత్రంలోని తోటబావి కల్యాణ వేదిక వద్ద జరిగిన కల్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణం నిర్వహించగా, పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయవర్గాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో స్వామి వారి తరపున పడిగన్నగారి ఆంజనేయులు దంపతులు,అమ్మవార్ల తరపున మహాదేవుని భాస్కర్ దంపతులు పాల్గొన్నారు. గర్భగుడిలో జరిగిన కల్యాణోత్సవంలో అమ్మవారి తరపున మహాదేవుని రవి, స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లయ్య దంపతులు పాల్గొన్నారు. స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకు లు ఆలయం నుంచి పోలీసుబొమ్మ, రాతిగీరలు, ఆల య పరిసరాల్లో ఊరేగించారు. మేళతాళాలు, కోలా టం, చెక్క భజనలు, వేద పాఠశాల విద్యార్థుల శివకీర్తనలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కాశీ పీఠాధిపతి డాక్టర్ మల్లికార్జున శివాచార్య మహాస్వామి వేద పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. వీరశైవ ఆగమ పండితులు, పురోహితులు, ఆగమ పాఠశాల వేదపండితులు, ఆగమ విద్యార్థులు కల్యాణోత్సవం నిర్వహించారు. పురోహితులుగా నడిపుడి మఠం భవనయ్య స్వా మి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్య స్వామి వ్యహరించారు. డాక్టర్ మహంతయ్య,నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామీజీ వ్యాఖ్యాతలుగా వ్యహరించారు. భక్తుల కోసం శామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5గంటలకు రెండు క్వింటాళ్ల బియ్యా న్ని అన్నం వండి రాశిగా తయారుచేసి దిష్టికుంభం తీశారు.

హాజరైన ప్రముఖులు

కల్యాణానికి ముందు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి తరపున మహదేవుని వంశస్తులు, పడిగన్నగారి వంశస్తులు కూర్చుని కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణానికి తాళి, మట్టెలు, ఒడిబియ్యం, బట్టలను వారు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 12గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు,ముత్యాల తలంబ్రాలను ఆలయవర్గాలు సమర్పించాయి. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూ రి ప్రతాప్‌రెడ్డి, నాగపురి రాజలింగం, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి హాజరయ్యారు.ఆలయ ఈవో ఎ.బాలాజీ, దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారు లు బృందం, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సిబ్బంది కల్యాణోత్సవం సవ్యంగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు.

ఇబ్బందులు ఎదుర్కున్న భక్తులు...

ఈసారి గతంలో కంటే భక్తులు తక్కువగా వచ్చినప్పటికీ వారికి సరిపడా సౌకర్యాలు కల్పించడంలో ఆలయవర్గాలు విఫలమైనట్లు విమర్శలు వచ్చాయి. కల్యాణ వేదిక వద్దకు చేరుకునేందుకు అడుగడుగునా పోలీసుల ఆంక్షలతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికార పార్టీ నేతల హడావిడి కనిపించింది. వీవీఐపీ, వీఐపీ పాసులతో వందల సంఖ్యలో నాయకులు తరలిరావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. డోనర్లు, భక్తులకు కుర్చీలు లేకుండా పోయాయి. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి వచ్చిన సమయంలో పార్టీ నాయకులు వందల సంఖ్యలో కల్యాణ వేది క ప్రదేశానికి దూసుకురావడంతో పోలీసులు వారిని అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. జోగిని శ్యామల, క్రాంతిని ఆలయవర్గాలు కల్యాణ వేదిక పైకి వెళ్లేందుకు అనుమతించారు. మరికొంత మంది జోగినీలకు అనుమతి ఇవ్వకపోవడంతో వారు గంటల పాటు కల్యాణ వేదిక కిందనే ఒడిబియ్యంతో వేచి ఉండి తమను ఎందుకు రానివ్వడం లేదని ఆలయవర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిత్తడిగా మారిన కొమురవెల్లి ప్రధాన వీధి

భక్తుల మధ్య ఆశీనులైన ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం సందర్భంగా ఎన్నడూ లేనివిధంగా ఆలయ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భక్తుల మధ్య కూర్చొని స్వామి కల్యాణాన్ని వీక్షించారు. వేదికపై అధికార పార్టీకి చెందిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కూర్చోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

చిత్తడిగా మారిన ఆలయ ప్రధాన వీధులు

క్షేత్రంలోని ప్రధాన వీధులు చిత్తడిగా మారడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజగోపురం నుంచి మల్లన్న కల్యాణ వేదిక వద్దకు వచ్చే ప్రధాన రోడ్డుపై నీళ్లు నిలవడంతో బురదమయంగా మారింది. బస్టాండ్ సమీపంలో కుక్క మృతి చెందినప్పటికీ దానిని తొలిగించకపోవడంతో అటువైపుగా ప్రయాణించిన భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.


సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కొమురవెల్లిలో అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులను నియంత్రిస్తున్న పోలీసులు


కొమురవెల్లిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మల్లన్న ఫొటోను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దేవుడి దగ్గర రాజకీయాలు తగవు

విలేకరులతో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకోవాలి
- మల్లన్న కల్యాణం బ్రహ్మాండంగా జరిపించాలి
- మల్లన్న ఆశీస్సులు అందరిపై ఉండాలని మొక్కుకున్నా
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 29 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం వద్ద రాజకీయాలు చేయడం సరికాదని, అనాదిగా వస్తున్న సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయవర్గాలు నడుచుకుంటే బాగుంటుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవానికి హాజరైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొమురవెల్లి మల్లన్న ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ప్రొటోకాల్ పాటిస్తే అందరికీ బాగుంటుంది అనేది తన అభిప్రాయమని, దేవుడి విషయంలో రాజకీయం చేయదల్చుకోలేదన్నారు.మల్లన్న కల్యాణోత్సవానికి వేలాది మంది భక్తులు వచ్చేవారని, ఈసారి భక్తుల సంఖ్య తగ్గిందని, రాజకీయాలకు తావు లేకుండా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకువెళ్లి సమర్పించాల్సి ఉంటుందన్నారు. కానీ, ఇవాళ ప్రొటోకాల్ లేకుండా తాము మాత్రమే తీసుకుపోతున్నామని ఆలయ అధికారులు తెలియజేయడంతో దానిని వివాదం చేయకుండా భక్త జనులతో సహా తామం తా గ్యాలరీలో కూర్చుని కల్యాణాన్ని వీక్షించినట్లు ఎమ్మెల్యే పల్లా పేర్కొన్నారు. వచ్చే ఏడాది మల్లన్న కల్యాణం నాటికి మౌలిక వసతులు, సౌకర్యాలు పెంచి భక్తులు ఎక్కువగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. గతం లో మల్లన్న కల్యాణం బ్రహ్మాండంగా జరిగిందని, ఇప్పుడు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అధికారు లు భక్తులకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు.

కొమురవెల్లి మల్లన్న మా కులదైవం: మాజీ మంత్రి

కొమురవెల్లి మల్లన్న తమ కుల దైవమని, ఏటా స్వామి వారిని కుటుంబ సభ్యులతో దర్శించుకుంటానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.కల్యాణోత్సవానికి హాజరైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పూలు, పాలు అమ్మినా, యూనివర్సిటీలు పెట్టినా, మంత్రిని అయినా, నేడు ఎమ్మెల్యేను అయినా అంతా మల్లన్న దయతోనేనని అన్నారు. మల్లన్న ఆశీస్సులతో అన్ని విధాలుగా అభివృద్ధి చెందానని, తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. తన వయసు 72 ఏండ్లు అని, తన పుట్టువెంట్రుకలు ఇక్కడే తీశారని వెల్లడించారు.కొమురవెల్లి మల్లన్నను ఏది కోరుకున్నా సక్సెస్ అవుతానని ఆయన తెలిపారు.


భక్తుల మధ్య కూర్చుని కల్యాణం వీక్షిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మల్లన్న కల్యాణోత్సవానికి వస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

బండ మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

బండమల్లన్న గుట్ట పై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 29 : భక్తుల కొంగు బంగారం బండ మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల శివారుల్లోని బండ మల్లన్న గుట్టపై సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్వామి వారికి నిర్వహించే పూజల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నూతన ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బండ మల్లన్న ఆలయ అభివృద్ధి విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సం క్రాంతి పండుగ నాడు జరిగే జాతరను ప్రజలు సంతోషంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లింగాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, మాజీ ఎంపీపీ పంజాల కవితా శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు బాల కృష్ణ, యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి: దుండగుల చేతిలో దగ్ధమైన స్కూల్ వాహనాలను పరిశీస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ప్రిన్సిపాల్‌కు పరామర్శ...

వీరారెడ్డిపల్లిలో ఇటీవల గోల్కొండ పాఠశాలకు చెందిన రెండు వాహనాలను దుండగులు నిప్పుపెట్టి దహనం చేశారు. ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రిన్సిపాల్ రవిని పరామర్శించారు. దహనం చేసిన వాహనాలను పరిశీలించి విచారం వ్యక్తం చేశారు.

రోడ్డు కోసం రోడ్డెక్కిన చిన్నారులు

రామచంద్రాపురం,డిసెంబర్29: సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చిన్నారులు రోడ్డెక్కారు. ఫ్లకార్డులు చేత పట్టుకొని నిరసన చేపట్టారు. ఆదివారం తెల్లాపూర్‌లో నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీ వాసులు, చిన్నారులు కలిసి రోడ్లను బాగుచేయాలంటూ నిరసిస్తూ రోడ్డుపైకి వచ్చారు. ఉస్మాన్‌నగర్‌లోని హాల్‌మార్క్ కౌంటీ నుంచి బ్లూ బ్లాక్ స్కూల్ వరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ మాట్లాడుతూ.. తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ పరిధిలో రోడ్లు బాగా లేకపోవడంతో గేటెడ్ కమ్యూనిటీవాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నారులను స్కూల్స్‌కి పంపించాలంటే స్కూల్ బస్సులు కాలనీల్లో తిరుగలేని పరిస్థితి ఉన్నదని చెప్పారు. సన్సియవిల్లాస్ నుంచి బ్లూ బ్లాక్ స్కూల్ వరకు ఉన్న మున్సిపల్ రోడ్డుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మొదలు కాలేదని తెలిపారు. వట్టినాగులపల్లి నుంచి ఉస్మాన్‌నగర్ వరకు ఉన్న హెచ్ఆర్‌డీసీఎల్ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచాయని, హెచ్ఎండీఏ అధికారులు భూసేకరణ చేస్తేనే రోడ్డు పనులను పూర్తి చేస్తామని హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులు సమాధానం ఇస్తున్నారని తెలిపారు. రోడ్డు పనులతో పాటు తాగునీటి పైప్‌లైన్ పనులు నిలిచిపోవడంతో తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. నిరసనలో మదన్‌మోహన్, రామ్‌కుమార్, అనిల్, సాయిపవన్ పాల్గొన్నారు.

రోడ్డు కోసం నిరసన చేపడుతున్న చిన్నారులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు

ఏడాది పాలనలో పదేండ్లు వెనక్కి

నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో నారాయణఖేడ్ పట్టణ అభివృద్ధి పదేండ్లు వెనక్కి వెళ్లిందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలో పలు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన రూ.10 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ పనుల టెండర్లను రద్దు చేసి ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, షాదీఖాన, ముస్లిం శ్మశానవాటిక, నీటిసంపు సామర్థ్యం పెంపు, అదనపు పైప్‌లైన్ కోసం మంజూరు చేసిన రూ.12 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తన కృషితో మంజూరు దశలో ఉన్న రూ.50 కోట్ల రోడ్డు భద్రత నిధులు కాంగ్రెస్ నాయకుల నిర్లక్ష్యంతో దూరమైనట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వ చొరవతో మేజర్ పంచాయతీగా ఉన్న నారాయణఖేడ్‌ను మున్సిపాలిటీగా మార్చి, గత మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో ప్రతి సమస్యను గుర్తించి అభివృద్ధి చేశానన్నారు. రూ.25 కోట్ల ఎస్డీఎఫ్ నిధులు, టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.35 కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధులతో మున్సిపాలిటీకి జేసీబీ, ఆటోలు, ట్రాక్టర్లను సమకూర్చినట్లు గుర్తుచేశారు. విద్యుత్ సరఫరాను మెరుగుపర్చేందుకు సుమారు 4 స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, ప్రతిరోజు పట్టణానికి 15 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసి నీటి ఇబ్బందులు రాకుండా చేశామన్నారు. 100 పడకల దవాఖాన, 50 పడకల మాతాశిశు దవాఖానతో పాటు ఆక్సిజన్ ప్లాంట్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, గ్రంథాలయ భవనాన్ని నిర్మించామని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రజాసమస్యలే కేంద్రంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తే ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు చందాలు వేసుకుని చేసుకున్న పనులను రికార్డు చేసుకుని బిల్లులు తీసుకుంటున్నారని, మున్సిపల్ జనరల్ ఫండ్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రియల్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకు కాశీనాథ్ మందిర్, రాధాకృష్ణ మందిర్, శ్రీరామ మందిరం భూముల్లో నుంచి రోడ్డు వేయడం వెనుక గల మతలబేమిటని ప్రశ్నించారు. రహదారుల ఏర్పాటుకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించి రోడ్డు వేయాలని, ఆలయాల భూములను ఆక్రమించి రోడ్డు వేసే అధికారం ఎక్కడిదని నిలదీశారు. ఈ విషయమై తాము న్యాయపరంగా పోరాడుతామని, ఆలయ భూములను అన్యాక్రాంతం కానియబోమన్నారు. బీఆర్ఎస్ పాలనను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, తమ స్వలాభం కోసం ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ నేతలను ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు ఎం.ఏ.నజీబ్, పరశురామ్, రవీందర్‌నాయక్, ముజామిల్, విఠల్ పాల్గొన్నారు.

అప్పులు తీర్చే మార్గం లేక

- కుటుంబంతో కలిసి ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం
- మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్
- చికిత్స పొందుతున్న భార్యాపిల్లలు
- సిద్దిపేట జిల్లాకేంద్రంలో ఘటన

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 29 : అప్పుల బాధ తాళలేక ఏఆర్ కానిస్టేబుల్ తన భార్యాపిల్లలకు ఎలుకల మందు ఇచ్చి తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట కాళ్లకుంట కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు,బాధితుల వివరాల ప్రకారం..రాజన్నసిరిసిల్ల జిల్లా లిం గన్నపేట గ్రామానికి చెందిన బండారి బాలకృష్ణ (34) పదేండ్లుగా ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.ప్రస్తుతం రాజన్న సిరిసిల్లలోని 17వ బెటాలియన్‌లో ఎఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొత్తగా ఇంటి నిర్మాణానికి కొంత అప్పుచేయగా, ముంబయికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీని నమ్మి రూ.25 లక్షల వరకు పెటుబడి పెట్టి మోసపోయా డు. వీటికోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనబడక శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చాడు.తాను ప్రైవేట్ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయానని భార్యతో బాలకృష్ణ చెప్పి బాధపడ్డాడు.అప్పుల వారు వేధించకుండా ఉండాలంటే ఆత్మహత్య ఒక్కటే మార్గం అని అనుకున్నాడు. వెంటనే కుంటుంబీకులకు ఎలుకల మం దు కలిపిన చాయిని తగించి తాను తాగా డు.ఏమి కాకపోవడంతో మరో గదిలోకి వెళ్లి ప్యాన్ కు బాలకృష్ణ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఆదివారం తెల్లవారుజామున భర్త బాలకృష్ణ కనిపించక పోవడంతో మరోగదిలో చూడగా ప్యాన్‌కు వేళాడుతూ కనిపించాడు. వెంటనే ఇంటి పక్కవారికి, కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపింది.

ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణ మృతదేహం

చాయిలో ఎలుక మందు..

అప్పుల వారి నుంచి తప్పించుకోవాలంలే మరణం ఒక్కటే మార్గం అని నమ్మిన బాలకృష్ణ, తన కుటుంబ సభ్యులకు అనుమానం రాకుండా పథకం అమలు చేశాడు. ముందుగా అనుకున్నట్లు ఎలుకల మందు ను తన వెంట ఇంటికి తెచ్చాడు. భార్య మానసకు చాయి పెట్టమని చెప్పి ఎలుకల మందును కలిపి చాయి తాగారు.అయినా ఎవరికి ఏమీ కాకపోవడంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కడుపులో తిప్పినట్టుగా కావడంతో స్థానికులు బాలకృష్ణ కుటుంబ సభ్యులను దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి ఎలుకల మందు తాగారని నిర్ధారించారు. అంత వరకు భార్య మానస, కొడుకులు యశ్వం త్, అశ్విత్‌కు తాము పురుగుల మందు తాగిన విషయం తెలియదు. పురుగుల మందు తాగిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు.కానిస్టేబుల్ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ భార్య, కుమారులు